డాక్టర్ చేతులు కడుక్కొంటూ అన్నాడు: "ఆవిడ రెండు మూడు రోజులుకంటే బ్రతకదండి! ఎనభై దాటలేదూ మీ అమ్మగారికి?"

కృష్ణమూర్తి కంఠం దుఃఖంతో పూడుకొనిపోయింది.

సమాధానం యివ్వలేక తలూపేడు.

డాక్టర్ వెళ్ళిపోయాక కొడుకుని పిలిచేడు. "ఆనంద్, బాబయ్యలిద్దరికీ, అత్తకీ ఫోన్ చేస్తావా?"

ఆనంద్ తండ్రివైపు విచిత్రంగా చూసేడు. తండ్రికి షష్టిపూర్తి అయి నాలుగేళ్లు కావస్తోంది. కన్నతల్లి మరణశయ్యపై వుందంటే ఈ వయస్సులోకూడా తండ్రి భరింపలేకపోతున్నాడు.

కృష్ణమూర్తి తల్లి మంచం పక్కనే కుర్చీలో కూర్చుని వుండిపోయాడు.

తనను కని పెంచిన తల్లి జీవితం క్షణాలలోకి వచ్చేసింది.

తనకి గోరుముద్దలు తినిపించిన తల్లి చేతులు నిర్జీవంగా పడివున్నాయి.

కృష్ణమూర్తి మనస్సు బరువెక్కింది.

భర్తని భోజనానికి పిలవడానికి వచ్చిన వరూధిని అతని కంటిలో తడిని చూసి తెల్లబోయింది.

అస్తమానం భర్త సణుక్కునేవాడు- "ఈ ముసలావిడ ఆయుస్సు అనంతం లాగుంది. ఇద్దరు తమ్ముళ్ళూ చేతులు దులిపేసుకొన్నారు. నా నెత్తిన ఈ బరువు పడింది."

ఎంత విసుక్కొన్నా ఆవిడ అయన కన్నతల్లి.

తల్లి మృత్యుముఖంలో వుందంటే ఆయన భరింపలేకపోతున్నాడు.

వరూధిని మెల్లగా అంది:

"మీకసలే బ్లడ్ప్రెషర్ వుంది. అత్తగారి దగ్గర నేను కూర్చుంటాను. మీరు భోజనం చేసిరండి. వంటావిడ వడ్డిస్తుంది"

కాని కృష్ణమూర్తి కదలలేదు.

ఆయన మనస్సు తోబుట్టినవాళ్ళ చుట్టూ పరిభ్రమిస్తోంది.

పెద్ద తమ్ముడు రామచంద్ర యూనివర్శిటీలో రీడర్.

ఫోనులో మాట్లాడగానే వెంటనే బయల్దేరుతున్నానని చెప్పేడు.

రెండోతమ్ముడు రవిచంద్ర బొంబేలో ఎటామిక్ ఎనర్జీ సెంటర్లో సైంటిస్ట్.

ఫోనులో దొరకలేదు. టెలిగ్రాం యిచ్చేరు.


చెల్లెలుకమల, భర్త అనంతపురం దగ్గర ఓ పల్లెటూరిలో బేంక్ ఏజంట్.

ఆ వూరు టెలిగ్రాంకంటె ఉత్తరమే ముందు చేరుతుంది.

ఆనంద్ వాళ్ళ ఆఫీసులో ప్యూనుకి దారి ఖర్చులిచ్చి కమలను తీసుకొని రమ్మనమని పంపేడు.

కృష్ణమూర్తి మనస్సు విలవిల లాడసాగింది.

ఆ క్షణంలో తోడబుట్టిన వాళ్ళంతా తనతోపాటు అమ్మ సమక్షంలో వుంటే బాగుండు ననిపిస్తోంది.




మధ్యాహ్నానికల్లా రామచంద్ర వచ్చేసేడు. వస్తూనే అన్నాడు:

"అమ్మ కెట్లావుంది అన్నయ్యా!"

కృష్ణమూర్తి కంఠం శోకంతో వణికిపోయింది.

రామచంద్ర తల్లి చేతిని తన చేతిలోనికి తీసుకొన్నాడు

అన్నగారి వైపు తిరిగి అన్నాడు:

"ఈ కోమాలోనుండి అమ్మకు తెలివి రాకపోవచ్చును."

తమ్ముడువచ్చాక కృష్ణమూర్తికి ఎంతో రిలీఫ్‌గా అనిపించింది.

అంతవరకూ గుండెలమీదవున్న భారం సగం తగ్గినట్లనిపించింది.

"హఠాత్తుగా ఫోను వచ్చేసరికి నిల్చున్నవాడిని నిల్చున్నటుగా బయల్దేరి వచ్చేసేను పిల్లలకు పరీక్షలు"

భార్య రానందుకు వదినగారికి సంజాయిషీ చెప్పూలోపలకి నడిచేడు రామచంద్ర.

అన్నదమ్ములిదరూ రాత్రి భోజనాలు చేసివచ్చి తల్లిదగ్గర కూర్చొనివున్నారు.

ఎవరెవరో వచ్చి వెడుతున్నారు.

"శాంతమ్మగారు అదృష్టవంతురాలు. చిన్నతనంలో భర్తపోయినా ముగ్గురు కొడుకులనీ పెద చదువులు చదివించి వృద్ధిలోకి తీసుకొని వచ్చింది. ఉన్న ఒక్క కూతురినీ ఐశ్వర్యంవున్న కుటుంబంలో పడేసింది...."

ఎవరి మాటలూ రామచంద్ర చెవులను తాకడంలేదు.

"రామూ! నీ దగ్గర కొచ్చి వుండాలని వుందిరా!"

క్రిందటి సెలవుల్లో తల్లి అన్నమాటలు గుర్తుకు వచ్చి మనస్సు చేదెక్కింది రామచంద్రకి.

నాలేళ్ళ క్రిందట ఆస్తి పంపకాలు జరిగేయి.

పిల్లలు గలవాడని పెద్దన్నకూ, చిన్నవాడు అచ్చటా ముచ్చటా తిన్నగా జరగలేదని రవిచంద్రకూ ఎక్కువ ముట్టచెప్పింది తల్లి.

న్యాయంగా రావలసిన భాగం తనకు రానేలేదు.

అప్పటి నుండీ తల్లి పట్ల విముఖత పెంపొందసాగింది తనలో.

అన్నగారు తల్లిని నిర్లక్ష్యం చేస్తున్నాడని తెలిసినా తాను తల్లిని తనతో తీసుకొని వెళ్ళే ప్రయత్నం చెయ్యలేదు.



# జాగరణ

నందుల సుశీలాదేవి

"పెద కొడుకో" అని కలవరించే తల్లిని తనతో ఉండమని కోరలేదు.

రామచంద్రుడు తల్లిని చూస్తుంటే చేదు జ్ఞాపకాలతోపాటు, దుఃఖపు తెరలూ అలలు అలలుగా మనస్సుని ముంచుకొంటున్నాయి.

తనకి ఎనిమిదో ఏట టైఫాయిడ్ వచ్చింది.

ఆ యిరవైరోజులూ తలి పచ్చిగంగ ముట్టలేదు.

తనకి పత్యం పెట్టాక శనివారాలు చేయటం మొదలుపెట్టింది.

అప్పటినుండీ ఈ క్షణంవరకూ ఆ నియమం వదలలేదు.

అన్నదమ్ములిద్దరూ పడక కుర్చీలలో కూర్చొని నిద్రా, మెలకువా కాని స్థితిలో రాత్రి గడిపేసేరు

తెలతెలవారుతుంటే రవిచంద్ర వచ్చేడు.

"హైదరాబాద్ వరకూ ఫ్లయిట్ లో

వచ్చాను. అక్కడనుండి టాక్సీ తీసుకొని వచ్చేను. అమ్మని ఎవరు ట్రీట్ చేస్తున్నారు? ఎవరైనా స్పెషలిస్ట్‌ని పిలిపించారా?"

తమ్ముడి మాటలకు కృష్ణమూర్తి మనసు చివుక్కుమంది.

అస్తమిస్తున్న సూర్యబింబం వంటిది తల్లి పరిస్థితి.

ఈ వయసులో వైద్యంతో ఆయుషుని పొడిగించటం అసాధ్యం.

అప్పటికీ తమ ఫామిలీ డాక్టర్ చేత వైద్యం చేయిస్తూనే వున్నాడు.

అమ్మ గురించి అంత ఆదుర్దా వున్న వాడు బొంబేలో స్పెషలిస్టులచేత చూపించలేకపోయేడా?

బియ్యం దొరకవనీ, అన్నింటికీ దూరాలని, వుంటున్న ఫ్లాటులో అమ్మకే సదుపాయంజరగదనీ ఏవేవోకుంటిసాకులు చెప్పేడు తప్ప. ఏనాడూ అమ్మని తనతో తీసుకుని వెళ్ళలేదు.

రవిని చిన్న కొడుకని తెగ ముద్దు చేసేది అమ్మ.

పెద్దకోడలి కిస్తుందనుకొన్న నాల్గు పేటల పలకసర్లూ రవి పెళ్ళానికిచ్చేసింది.

"దేశంకాని దేశంలో వున్నాడు బిడ్డ తిన్నగా తింటున్నాడో లేదో" అని ఎప్పుడూ రవి గురించే పలవరించేది.

రవిచంద్ర తల్లి పక్కనవచ్చి కూర్చొన్నాడు. అతని రెండుకళ్ళూ నీటితో నిండిపోయేయి.

"అమ్మా!" అన్నాడు.

ఆ తల్లి పలకలేదు.

రవిచంద్ర వెక్కి వెక్కి ఏడ్చేడు. తనని కంటికి రెప్పలా కాచిన తన అమ్మ



నందుల సుశీలాదేవి

యింక పలకదు.

తాను ఫారిన్ నుండి తిరిగివచ్చాక పెళ్ళి చేసుకోమని తెగ పోరేది.

చివరకు విసిగిపోయి అంది:

"నువ్వు సింధీ పిల్లను చేసుకొన్నా, మరాఠీ పిల్లను చేసుకొన్నా కూడా నాకు పట్టింపులేదు. ఎవరూ తోడు లేకుండా మాత్రం జీవితాన్ని గడపకు. ఒంటరితనమంత మహాపాపం లేదు. ఎవరో నీ మనస్సుకి నచ్చినవాళ్ళను జోడుగా తెచ్చుకో."

తల్లిలోని అధునాతన భావాలకు తాను కరిగిపోయేడు.

చివరకు తల్లి యేరికోరి కుదిర్చిన సంబంధమే తాను వొప్పుకున్నాడు.

తల్లికి దూరపు బంధువైన కరుణతో తన వివాహం జరిగింది





అంతా మురిపెంగా తెచ్చుకొన్న కోడలు ముచ్చట మూడు రోజులకే తీరిపోయింది అమ్మకు.

మూడు నిద్రలలోనే తల్లి పెట్టిన పలకసర్లు పాతవనీ, చీరల్లో జరీ తక్కువగా వుందనీ తల్లి మొహం మీద దులిపేసింది కరుణ.

ఆ తర్వాత తర్వాత ఆంధ్రా వచ్చినా తను ఒక్కడూ వచ్చి తల్లిని చూసి వెళ్ళేవాడు.

కరుణను వప్పించి తనతో తీసుకొని వచ్చినా తల్లి మనస్సు గాయపడేలా కరుణ ప్రవర్తన వుండేది.

తన మూడో సంవత్సరంలోనే చనిపోయిన తండ్రి మొహం తనకు గుర్తుకు రాలేదు.

తల్లీదండ్రీ అయి అమ్మ తనను పెంచింది

కాని ఒక్కరోజు తల్లిని తన సంసారంలోకి ఆహ్వానించలేకపోయాడు.

తనలోని అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి ఏవేవో కారణాలు చెప్పేవాడు.

కరుణా, పిల్లలతోనే తన జీవితం ముడిపడిపోయింది.

తల్లి పెంచి, పోషించిన ఫలవృక్షం తాను.

ఆ ఫలసాయాన్ని కరుణ అనుభవిస్తోంది.

తల్లి ప్రేక్షకురాలే అయిపోయింది.

ఈ రోజు అమ్మ భౌతికంగా కూడా తమనుండి దూరం అయిపోతోంది.

రవిచంద్ర మనస్సంతా కలచిన సరోవరంలా అయిపోయింది.

మధ్యాహ్నం అవుతూనే కమల వాడిపోయిన మొహంతో వెక్కి వెక్కి ఏడుస్తూ ట్రెయిన్ దిగింది.

గుమ్మంలో యెదురైన రవిచంద్రను చూస్తూ,

"రవీ! అమ్మ...." అంది.

రవిచంద్ర అక్కచేతిని పట్టుకొని అన్నాడు.

"కోమాలోవుంది. ఏ క్షణం యెట్లాంటిదో చెప్పలేం."

కమల బావురుమంది

శాంతమ్మ మంచం చుట్టూరా ఆవిడ కన్న సంతానం నల్గురూ కూర్చున్నారు.

ఎవరో అంటున్నారు.

"అందరు ఓడలూ వచ్చేదాకా ఆ జీవుడు కట్టెను వదలటంలేదు. చిత్రం చూడండి"

సూర్యుడు అస్తమించే వేళకు శాంతమ్మ కంఠంలో గురక మొదలయింది.

"అయ్యో దించండి.... దించండి.... తులసి తీర్థం తెండి.... కృష్ణమూర్తీ! ఆవిడ చెవిలో నారాయణ నారాయణ అను ....వరూధినీ! గంగ చెంబు బ్రద్దలు కొట్టు...."

నలుగురు నాలుగు మాటలూ అంటున్నారు.

"అమ్మా!" అంటూ కమల విరుచుకుని తల్లి మీద పడిపోయింది.

కృష్ణమూర్తి బావురుమన్నాడు.

రవిచంద్ర వెక్కి-వెక్కి- ఏడుస్తూ తల్లి పాదాలమీద తలకొట్టుకో సాగాడు.

రామచంద్ర తల్లి చేతులలో మొహం దాచుకొని శోకంతో నిలువునా వణికి పోయాడు.

ఎవరో అంటున్నారు :

"అదృష్టవంతురాలు. కన్న పంట పచ్చగా చల్లగా వుండగా దాటిపోయింది."

బంధువులూ, స్నేహితులూ, పరిచయస్థులతో యిల్లంతా నిండిపోయింది.

దగ్గరవుండి తంతు జరిపిస్తున్న బ్రాహ్మడు అంటున్నాడు :

"రాత్రి శవజాగారం చెయ్యాలి. ప్రొద్దుటకాని శవదహనం జరగడానికి వీలులేదు."

దుఃఖంతో సొమ్మసిల్లిపోయిన కమలను తన వడిలోకి తీసుకొంది వరూధిని.

ప్రథమ శోకోద్వేగం తగ్గి అందరూ నిశ్శబ్దంగా వున్నారు.

"అమ్మని తెల్లవారేవరకూ కంటినిండుగా చూసుకోవచ్చును."

కమల అంది పూడుకొనిపోయిన కంఠంతో.

రాత్రి పదయ్యేసరికి శాంతమ్మ సంతానంతప్ప, యిల్లంతా కాళీ అయింది.

బంధువులూ, స్నేహితులూ అందరూ మెల్లగా కదిలిపోయేరు.

వరూధిని అందరికీ వేడి వేడి కాఫీలు తెచ్చి యిచ్చింది.

"అమ్మతోపాటు నేనూ చచ్చిపోతాను" అంటూ ఏడుస్తూ కమల అయిష్టంగానే కాఫీ తీసుకొంది.

నిస్త్రాణగా తల్లిదగ్గర పడివున్న రవిచంద్రను లేపి కాఫీ యిచ్చింది వరూధిని.

కళ్ళు రెండూ తుడుచుకుని కాఫీ కప్పు అందుకొన్నాడు రవిచంద్ర.

వదినగారి మొహంలోకి చూసి 'వదినా' అంటూ వెక్కి- వెక్కి- ఏడ్చాడు రామచంద్ర.

"పండిన పండు రాలకమానదు రామూ! ఇదుగో కాస్త కాఫీ తాగు

రామచంద్ర కాఫీ తాగి కాస్త విశ్రాంతిగా ఫీలయ్యాడు.

# పెండ్యులం

ఈ తోటలో కొమ్మలు సంగీత కచేరీ చేస్తాయి
అపరిచిత తీరాలలో ఆకులు గీతాలు రాస్తాయి
స్వరాలు చప్పరిస్తూ తోట తోటంతా కరిగిపోయి
ప్రవహించే రాగాలే మిగులాయి.
(విషాదం చుట్టుకుంటే నన్ను నేనొక శైలుగోడగా
సృష్టించుకుంటాను. కన్నీటి తెరచాప తెగరేసి
చూపుల పడవల్లో దిక్కులన్నీ ఆవరిస్తాను
సముద్రమై దిగంతాన్నయ్- అక్షరమై బ్రహ్మాండమై
చివరకు శూన్యమై మిగులుతాను)
స్పృహకూ స్మృతికీ మధ్య చేతుల్లేని ఆత్మ డోలనం చేస్తుంది
సుఖదుఃఖాల ప్రవాహాలలో విలీనమై
జీవన వేదనలా మనిషి నల్లుకుపోతూంది!
కన్నీళ్ళతో బ్రతుకును కొలుస్తున్నాడు
ఆలోచనల స్నాయువులమీద
జ్ఞాపకాల హిందోళ వింటున్నాను
పురిటి గదిలో రోదన- గోరీలమధ్య రొదీగాలి
ప్రేక్షకుల్లేని రూపకానికి ఊపిరి పలికే భరతవాక్యం—
పక్షి ఎగిరిపోయినా కొమ్మలు
దాని పాటను మరిచిపోవు
చివరి ఆకునూ రాల్చుకున్న చెట్టు ఆకాశాన్ని మోస్తుంది
జీవితం కోల్పోతున్న మనిషి ఆకాశమై
మళ్ళీ ఉదయాన్ని దర్శిస్తాడు....

—వి. యస్. ఆర్. అవధాని


భర్తని సమీపించింది వరూధిని. కృష్ణమూర్తి శూన్యంలోకి చూస్తూ అన్నాడు.

"నాకేమీ వద్దు"

వరూధిని మృదువుగా అంది: "మీరు తాగకపోతే వాళ్ళూ తాగరు."

కృష్ణమూర్తి కప్పు చేతిలోకి తీసుకొన్నాడు.

ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది.



తల్లి శవం దగ్గర్లో కృష్ణమూర్తి గోడకు చేర్లబడి కూర్చున్నాడు.

రామచంద్ర దూరంగా మోకాళ్ళలో తలదాచుకొని కూర్చున్నాడు.

కమల, రవిచంద్ర తలికి సమీపంలో చాపమీద కూర్చొని వున్నారు.

వరూధిని అప్పుడప్పుడు వచ్చి అత్త గారి తల దగ్గర ప్రమిదలో నూనె పోస్తోంది.

పదకొండు గంటలు కొట్టింది గడియారం.

ఆ నిశ్శబ్ద నిశీథిలో శాంతమ్మ దీర్ఘ నిద్రకు సాక్షిగా ప్రమిదలో వత్తి మినుకు మినుకు మంటోంది.

పదకొండున్నర అయ్యేసరికి కృష్ణ మూర్తి అన్నాడు నెమ్మదిగా

"నాకు వళ్ళు తూలుతున్నట్లుంది. కొంచెం నడుం వాలుస్తాను "

సంకోచంతో అతని కంఠం వణికింది.

లోపలకు నెమ్మదిగా దారి తీస్తున్న పెద్ద అన్నయ్యను చూస్తూ నిట్టూర్చింది కమల. "కొడుకో అని కలవరిస్తారు తల్లులు. తెల్లారితే ఈ దేహం పంచ భూతాలలో కలిసిపోతుంది. జీవితంలో కనపడమన్నా మరి కనపడని అమ్మకోసం ఒక్క రాత్రి నిద్ర సౌఖ్యాన్ని వదులుకో లేకపోతున్నాడు అన్నయ్య"

తల్లివెపు చూసింది. అంతలో ఆమె కళ్లు నిండుకొని వచ్చాయి.

ఇంకొక గంట గడిచింది.

రామచంద్ర నెమ్మదిగా అన్నాడు తట పటాయిస్తూ:

"రవీ! కాసేపున్నాక నన్ను లేపు సావిట్లో సోఫాలో కాసేపు రిలాక్స్ అవు తాను."

రవిచంద్ర మనస్సులో ముల్లు గుచ్చు కొంది. తన రకం ధారపోసి పెంచింది అమ్మ తనా.

ఒక్క రాత్రి ఆమెకోసం నిద్రను వదు లుకోలేని బలహీనతతో అన్నలు బాధపడు తున్నారు.

పన్నెండు దాటేక వరూధిని నెమ్మదిగా లోపలకు దారితీసింది.

ఎర్రగా వాచిన కళ్ళతో కమల అసహ నంగా వదినవైపు చూసింది.

వరూధిని లోపలకు వెళ్ళిపోయింది కమల మనస్సు చివుక్కుమంది.

"కన్న సంతానం కొడుకులకే నిద్ర ఆగలేదు. ఓ రాత్రి నిద్ర పోగొట్టుకోలేక తల్లి శవాన్ని వదిలి వెళ్ళిపోయారు పరాయి యింటినుండి వచ్చిన ఆవిడకు బాధ యెందుకు వుంటుంది?"

అంతలో కమల ఆలోచనలు చెదిరి పోయాయి.

ట్రేలో వేడి వేడి టీ కప్పులతో వరూ ధిని లోపలకు వచ్చింది.

రవిచంద్రకూ, ఆడపడుచుకీ యిచ్చింది.

అత్తగార పక్క చుట్టూ చీమల మందు చల్లింది.

ప్రమిదలో మరికాస నూనె పోసి వత్తిని ఎగదీసింది వరూధిని.

రెండు గంటలకు రవిచంద్ర నెమ్మ దిగా ఆవలిస్తూ లేచాడు.

"వదినా తలనొప్పిగా వుంది. ఏద యినా టాబ్లెట్ యిసావా?"

వరూధిని లేచి వెళ్ళి మాత్రా మంచి నీళ్ళు తెచ్చి యిచ్చింది.

రవిచంద్ర పడక కుర్చీ సావిట్లో ఫేన్ దగ్గరగా వేసుకొని కళ్ళు మూసుకొన్నాడు.

కొంచెం సేపటో సన్నగా గురక తీస్తున్న మరిదిని చూసి సావిట్లో ట్యూబ్ లైట్ తీసేసి బెడ్‌లైట్ వేసి, అత్తగారి గదిలోకి వచ్చింది వరూధిని.

కమల, వరూధిని శాంతమ్మ శవం దగ్గర మౌనంగా కూర్చుని వుండిపోయేరు.

మరొక అరిగంట గడిచేసరికి కమలకు కళ్ళు కూరుకొని పోసాగాయి.

పడుకోవాలంటే మనస్సు వప్పడం లేదు.

కాని అంతలో మనస్సులో అను కొంటోంది.

ఒక్క క్షణం కన్ను మూసి వో కునుకు తీస్తే బాగుండుననిపిస్తోంది.

అంతలో మనస్సులో ఏదో కించగా అనిపిసోంది.

కళ్ళు తెరవాలంటే విశ్వప్రయత్నం చేయాల్సివస్తోంది.

శవం వున్న గదిలో నడుం వాల్చా లంటే అసలు మనస్కరించటంలేదు.

ఒక్క రెండు గంటల నిద్రను ఆపు కొంటే తెల్లవారిపోతుంది.

కాని కళ్ళు భగభగా మండుతుంటే నిద్రను ఆపుకోవటం బ్రహ్మప్రళయం అవుతోంది

కమల నెమ్మదిగా లేచింది. "వదినా!" అంది.

వరూధిని తలెత్తింది.

"నన్ను ఒక్క పావుగంటలో లేపు. ప్రయాణంతో వళ్ళంతా పచ్చి పుండులా వుంది. ఒక్క క్షణం నడుం వాలుస్తాను."

కమల నెమ్మదిగా వెళ్ళి సావిట్లో చాప మీద వాలిపోయింది.

గోడ గడియారంమూడుగంటలు ఠంగు ఠంగున కొట్టింది.

కృష్ణమూర్తి గాఢనిద్రలో మునిగి వున్నాడు.

రామచంద్ర వళ్ళు తెలియని నిద్రలో వున్నాడు.

రవిచంద్ర గట్టిగా గురక పెడుతూ సుఖ నిద్రలో వున్నాడు.

కమల గాఢ సుషుప్తిలోకి జారి పోయింది.

ఆ నల్గురునీ కన్న తల్లి శాశ్వత నిద్ర పోతోంది.

వేకువ చలిగాలి సన్నగా వీస్తోంది.

వరూధిని అత్తగారి దగ్గర్లో కూర్చుని ప్రమిదలో నూనె వేస్తూ, అప్పుడప్పుడు చీమల మందు అత్తగారి పక్క చుట్టూ చల్లుతూ శేష రాత్రిని జాగరణ చేసింది.

●

(మా పెద్ద తమ్ముడు డాక్టర్ నందుల సుబ్రహ్మణ్యంకు కృతజ్ఞతలు)

